## 2 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 3 : ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో భాగంగా సెప్టెంబర్‌లో రోజుకు 2 లక్షల టన్నుల ఉత్పత్తి, అదే క్రమంలో రవాణా చేయాలని సీఎండీ బలరాం అధికారులను ఆదేశించారు. బొగ్గు ఉత్పత్తిలో రక్షణ, నాణ్యతకు పెద్దపీట వేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మంగళవారం డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలతో వీసీ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశిత 72 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళికాబద్ధగా పనిచేయాలన్నారు. కొత్తగూడెం వీకే ఓసీపీ, ఇల్లెందు రొంపేడు ఓసీపీ, బెల్లంపల్లి గోలేటి ఓపెన్‌కాస్ట్‌లు, రామగుండం కోల్‌మైన్స్‌కు సంబంధించిన అన్ని పెండింగ్ పనులను వేగంగా పూర్తిచేయాలని సూచించారు. ఒడిశాలో సంస్థ ప్రారంభించాల్సిన నైనీ బొగ్గుబ్లాక్‌పై కూడా ఆయన సమీక్షించారు. నైనీ బ్లాక్ ఉన్న ప్రదేశంలోని చెట్ల గణన, తొలగింపు జరిగితే వెంటనే ఉత్పత్తి ప్రారంభించుకోవచ్చన్నారు. డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం కోఆర్డినేషన్ సుభాని, సీపీపీ జీఎం జక్కం రమేశ్, మార్కెటింగ్ జీఎం రవిప్రసాద్, వివిధ విభాగాల జీఎంలు పాల్గొన్నారు.

## 8 నుంచి డబ్ల్యూపీఎస్‌అండ్‌జీఏ క్రీడలు

రెబ్బెన, సెప్టెంబర్ 3 : బెల్లంపల్లి ఏరియాలో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంటల్ క్రీడలు ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు జీఎం ఎం శ్రీనివాస్ తెలిపారు. గోలేటి సీఈఆర్ క్లబ్, జిమ్‌లో 8వ తేదీన బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, 9న గోలేటి సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వాలీబాల్, 10న బెల్లంపల్లి టీసీవోఏ క్లబ్‌లో లాన్ టెన్నిస్, 12న శ్రీ భీమన్న క్రీడమైదానం లో బాస్కెట్ బాల్, 15న గోలేటి సీఈఆర్ క్లబ్‌లో క్యారమ్స్, చెస్, కల్చరల్ క్రీడలు, 27న గోలేటి సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బాల్ బ్యాడ్మింటన్, 28న గోలేటి సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో కబడ్డీ పోటీలు ఉంటాయని వివరించారు. క్రీడాకారులు నిర్ణీత సమయానికి చేరుకొని నిర్వాహకులకు సహకరించాలన్నారు.

## దుప్పి మాంసం లభ్యం

పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 3 : పెంచికల్‌పేట్ మండలం మేరుగూడకు చెందిన దుర్గం ప్రవీణ్ ఇంట్లో మంగళవారం దుప్పి మాంసం పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో అనిల్ కుమార్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు మేరుగూడలో ప్రవీణ్ ఇంట్లో సోదాలు చేశామని, దుప్పి మాంసం దొరికిందని చెప్పారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు, పూర్తిస్థాయిలో విచారణ జరిగిపి నిందితుడిని పట్టుకోనున్నట్లు వెల్లడించారు.

## కాంట్రాక్టు కార్మికుల ధర్నా

జైపూర్, సెప్టెంబర్ 3 : ఇందారం ఓపెన్‌కాస్టు గనిపై మంగళవారం కాంట్రాక్టు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందారం ఓపెన్‌కాస్టులో ఓబీ పనులు నిర్వహిస్తున్న 'వరహ' కంపెనీ యాజమాన్యం రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు. అనేకమార్లు సింగరేణి యజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడంలేదని ఆరోపించారు. ఆందోళన చేస్తామనే సమాచారంతో కంపెనీ యాజమాన్యం కార్యాలయాలకు తాళాలు వేసి, వెళ్లగా కార్మికులు సింగరేణి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీతో మాట్లాడి, వేతనాలు అందేలా చూస్తామని పీవో ఏ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌వో సతీశ్ హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

















